క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్ అద్భుతం


కొరళ్ల సుధాకర్

ఏలూరు (టూటౌన్): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అద్భుతంగా ఉందని, మధ్యతరగతి, వేతన జీవులను, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను, సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని రూపొందించారని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొరళ్ల సుధాకర్ కృష్ణ పేర్కొన్నారు. వేతన జీవులకు గతంలో ఉన్న దానికంటే రూ.7లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వటం, సామాన్యులకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు పెంచటం ఆపైన ఐదు శ్లాబుల్లో విభజించడం వల్ల కొన్ని లక్షల మందికి ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుతుందన్నారు. రైల్వేలకు దేశ రక్షణ బడ్జెట్‌తో సమానంగా కేటాయింపులు చేయడం వల్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పెద్ద పెద్దపీట వేశారన్నారు. ప్రధాని ఆవాసయోజనకు రూ.79వేల కోట్లు కేటాయించడం వల్ల సామాన్యుల సొంతింటి కల నిజం అవుతుందని సుధాకర్ కృష్ణ పేర్కొన్నారు.

ఉపాధి నిధులకు కోత

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ కోరింది. సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని వామపక్షాల ఒత్తిడి మేరకు 2005లో నాటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి నిధులు రూ.89 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు తగ్గించిందని వాపోయారు. ఆహార భద్రతకు రూ.2 లక్షల 87 వేల కోట్ల నుంచి రూ.లక్షా 97 వేల కోట్లకు కుదించి గ్రామీణ పేదలకు తీవ్రమైన ద్రోహం చేసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు 10 శాతం ఉన్న మెటీరియల్ ఖర్చును 40 శాతానికి పెంచడం, బడ్జెట్లో నిధులు తగ్గించిందని విమర్శించారు. మున్సిపాల్టీల్లో ఉపాధి పనులు కల్పించాలని, ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని రామకృష్ణ కోరారు.

బడ్జెట్‌పై కార్మిక వర్గం నిరాశ

ఏలూరు (టూటౌన్): కేంద్ర బడ్జెట్ ఉద్యోగ, కార్మిక, స్కీం వర్కర్లను నిరాశ పర్చిందని సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. కార్మిక వర్గానికి కనీస వేతనాలు ప్రకటించకపోవడం శోచనీయమని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్‌లు తెలిపారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం, సీపీఎస్ రద్దు, అంగన్‌వాడీ, ఆశ, ఐకేపీ, మధ్యాహ్న భోజనం తదితర స్కీం వర్కర్లకు బడ్జెట్లో జరిగిన అన్యాయం సరిదిద్దే విధంగా చర్యలు చేపట్టాలంటూ వారు కోరారు.

సర్పంచ్‌కు సత్కారం

ఉంగుటూరు: ఉత్తమ సర్పంచ్ యర్రమిల్లిపాడు సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావును మండల అధికార్లు, సర్పంచులు, ఎంపీటీసీలు స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో సత్కరించారు.

నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ నిరాశ పర్చిందంటూ వివిధ పార్టీలు, రంగాల ప్రతినిధులు పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమం మాటల్లో తప్ప చేతల్లో కేటాయింపులు లేవని విమర్శించారు. ఎప్పటిలాగానే కార్పొరేట్ల బడ్జెట్ అని ఎద్దేవా చేస్తున్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయింపులు లేవని, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల తగ్గింపు తదితర అంశాలపై ప్రస్తావించలేదని తెలిపారు. 2014లో పెట్రోల్ లీటరు ధర రూ.70 ఉండగా ప్రస్తుతం రూ.112కు పెరిగిందని, గ్యాస్ సిలిండర్ ధర రూ.470 నుంచి రూ.1100కు చేరిందని వాపోయారు. తెలుగు రాష్ట్రాలకు నామమాత్రపు కేటాయింపులతో సరిపెట్టారని పేర్కొన్నారు.

పెద్దల బడ్జెట్



కేంద్ర ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా పెద్దల బడ్జెట్ అని పేదల బడ్జెట్ కాదు. కేంద్రం ప్రవేశ పెట్టిన రూ.45లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.13లక్షల కోట్లు రాష్ట్రాలకు వడ్డీ లేని రుణాలు, రూ.10లక్షల కోట్లు వడ్డీలకు, రవాణా రంగానికి రూ.5లక్షల కోట్లు, రక్షణ రంగానికి రూ.5.50 లక్షల కోట్లు కేటాయిస్తే మిగిలిన రూ.12లక్షల కోట్లతో దేశంలో అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుంది. 2014 నుండి భారత్ వెలిగిపోతుందంటూ ప్రచార ఆర్భాటం తప్ప అభివృద్ధి కనబడటం లేదు.

– డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, సీపీఐ

పేదల సంక్షేమాన్ని విస్మరించారు



పేద, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు లేవు. దేశవ్యాప్తంగా డిసెంబరు వరకు ఐదు కేజీల బియ్యం పంపిణీ చేయడం హర్షణీయం. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించే విధంగా శిక్షణా కేంద్రాలు, పరిశ్రమలు ఏర్పాటు వంటి వాటి గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరం. పేదలకు ఆసరాగా నిలిచిన ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం దురదృష్టకరం. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు లేకపోవడం బాధాకరం.

– డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏఐఏవైఎస్, ఏలూరు

రైతాంగానికి నిరాశ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. వ్యవసాయ రంగానికి నిధులు కోత పెట్టింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకూ మద్దతు ధరలు కల్పించి, చట్టబద్ధత కల్పించే చర్యలు లేవు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ ఫలితంగా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకొస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. వ్యవసాయాన్ని కార్పొరేట్ పరం చేసే కుట్రలు చేస్తుంది. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించలేదు.

– కె.శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, ఏలూరు

పట్టణ ప్రజలపై భారాలు



కేంద్ర బడ్జెట్ పట్టణ ప్రజలపై మరింత భారాలు పెంచేదిలా ఉంది. పన్నుల భారం తగ్గిస్తారేమో అని చేసిన పట్టణ ప్రజలకు తీవ్ర నిరాశ మిగిలింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గింపునకు చర్యలులేవు. వాహనచోదకులకు కేంద్ర బడ్జెట్ ఎటువంటి ఉపశమనం ఇవ్వలేదు. రాష్ట్రానికి సంబంధించి ఎటువంటి నిర్దిష్ట హామీలు ప్రకటించకపోవడం దారుణం. ఆంధ్ర కోడలు నిర్మలమ్మ రాష్ట్రానికి చేసిన హామీల గురించి మాట్లాడకపోవడం సిగ్గు చేటు.

– పి.కిషోర్, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్, ఏలూరు

ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత


వేణుగోపాల స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ ఆలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక తంగెళ్లమూడి శివగోపాలపురంలో శతాబ్దాల చరిత్ర గల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ పునః నిర్మాణ పనులకు నాని బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టడం సంతోషకరం అని, మహోన్నత కార్యక్రమమని ఆయన పాలక వర్గాన్ని, అధికారులను అభినందించారు. తొలుత నానికి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరాం, డిప్యూటీ మేయర్లు గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, కార్పొరేటర్లు నున్న స్వాతి కిషోర్, పిల్లంగోళ్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ ఎస్సైగా రామకోటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా రామకోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన్ని పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు బదిలీచేశారు. నగరంలోని త్రీటౌన్, వన్‌టౌన్, రూరల్ స్టేషన్లలో రామకోటేశ్వరరావు పనిచేశారు. కేసుల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించారు.

నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి


మాట్లాడుతున్న బాబ్జీ నంద

ఏలూరు (టూటౌన్): నాయీ బ్రాహ్మణులకు వచ్చే మార్చిలో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి కేటాయించాలని నాయీబ్రాహ్మణ నంద యువసేన రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంటూరి బాబ్జీ నంద కోరారు. ఏలూరులో బుధవారం రాత్రి నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నాయీ బ్రాహ్మణులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని అన్నారు. దుకాణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు సాయం అందిస్తున్నారని చెప్పారు. నామినేటెడ్ పదవుల్లోనూ నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు ఏలూరులో నిర్వహించిన బీసీ గర్జన కార్యక్రమంలో ప్రకటించిన విధంగా తమకు ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నంద యువసేన నాయకులు ముగొండ త్రినాథ్, సంఘం రాష్ట్ర ఉద్యోగ సేన కన్వీనర్ మలకా దుర్గాప్రసాద్, కార్యదర్శి పోతునూరు చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అరిసేపల్లి ప్రసాద్, ఏలూరు జిల్లా అధ్యక్షులు తాడివలస పవన్, ఏలూరు నగర అధ్యక్షులు చిట్టా బత్తుల శ్రీను, నగర ఇన్‌చార్జి రంబా రాజా పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా దాతలు


చిన్నారులకు రక్తమార్పిడి చికిత్సను పరిశీలిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బాధిత చిన్నారులకు అండగా దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారని రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. తలసేమియా భవనంలో బుధవారం 11 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స చేశారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని కృష్ణారెడ్డి ఆరా తీశారు. రక్తదాతల సహకారంతో ప్రతి వారం క్రమంతప్పకుండా రక్తమార్పిడి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. వెలమాటి చంద్రశేఖర్ జనార్దన్‌రావు సహకారంతో భవనంలో లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు, సహాయకులు 30 మందికి భోజనం ఏర్పాటు చేసిన వై.దెబోరాకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు ఆటంకం

ఏలూరు టౌన్: స్థానిక టూటౌన్‌లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు తాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడుతుందని కార్పొరేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాడైన నీటి సరఫరా ప్రధాన పంపు స్థానంలో కొత్త పంపు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. చాణక్యపురి కాలనీ, మోతేవారి తోట, అమీనాపేట, అశోక్‌నగర్, రాజీవ్‌గాంధీ పార్కు ఏరియా, తాపీమేస్త్రీ కాలనీ, టైటస్ నగర్, శాంతినగర్, ఫిరంగుల దిబ్బ, పోస్టల్ కాలనీ, 4 క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా నీటిని సరఫరాకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

10 మందికి జరిమానా

భీమడోలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న, బహిరంగ ప్రదేశాల్లో అల్లరి చేస్తున్న 10 మందికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బుధవారం జరిమానా విధించినట్టు ఎస్సై చావా సురేష్ కుమార్ తెలిపారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి రూ.10 వేలు చొప్పున, గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్న ఏడుగురికి రూ.200 చొప్పున జడ్జి రిషిక్ ఆదిత్య జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి సలాది సత్యనారాయణ (63) మృతి చెందారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు. భీమడోలు జంక్షన్‌కు చెందిన సత్యనారాయణ ఈనెల 19వ తేదీ తెల్లవారుజామున రహదారిపై వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి మోటార్ బైక్ తో ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన సత్యనారాయణను ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

పింఛన్ల పంపిణీ

పెదవేగి: పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ కవ్వగుంట, వంగూరు గ్రామాల్లో బుధవారం పరిశీలించారు. వలంటీర్లు పింఛన్‌లను లబ్ధిదారులకు అందిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో బుధవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు విశేషాలంకరణ చేశారు. సత్యనారాయణస్వామి వ్రతం అనంతరం ప్రదక్షిణ, పూజలు చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	15-20
బెండకాయలు	52	కంద	40
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	36
కాకర కాయలు	34-38	కీరా దోస	44
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	46
బీరకాయలు (పందిరి)	52	అల్లం	68
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	40	పాలకూర	08
దొండకాయలు	32	చుక్కకూర	08
బంగాళదుంపలు	26	తోటకూర	08
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	32	బఠాణి	60
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	38
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట


అవార్డులు స్వీకరించిన క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఏలూరు హేలాపురి రూరల్ లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట పండింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో మంగళవారం నిర్వహించిన లయన్స్ జిల్లా అవార్డుల కార్యక్రమంలో రూరల్ లయన్స్ క్లబ్‌కు ఎక్సలెన్స్ అవార్డు, హంగర్ రిలీఫ్, ఎన్విరాన్‌మెంట్, టాప్ 10 క్లబ్స్‌లో ఒకటిగా సర్వీస్ అవార్డులతో పాటు ప్రోత్సాహక అవార్డు, ఫస్ట్ బెస్ట్ ట్రెజరర్‌గా కేఎస్ఎస్ మాధవ్‌కు అవార్డు, థర్డ్ బెస్ట్ సెక్రటరీగా వెలగపూడి విష్ణుకుమార్‌తో పాటు కాకరాల రాజేంద్ర వరప్రసాదరావు, కాకరాల వేణుబాబు, చిట్టూరి శ్రీనివాసరావు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రత్యేక అవార్డులు లభించాయి. వీటిని లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ దామెర రంగారావు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు అందజేశారని క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి వినయ్ బాబు బుధవారం ఏలూరులో పత్రికలకు వెల్లడించారు.

అచ్యుతాష్టకం – విష్ణు సహస్రనామ పారాయణ పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం విద్యార్థులకు స్థానిక రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేదపాఠశాలలో అచ్యుతాష్టకం – విష్ణు సహస్రనామ పారాయణ పోటీలు నిర్వహించారు. అచ్యుతాష్టకం పోటీల్లో నగరానికి చెందిన శర్వాణి హైస్కూల్ విద్యార్థిని యష్మిక ప్రథమ, సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన ఎ.మనోజ్ఞ ద్వితీయ, శ్రీశ్రీ విద్యా సంస్థకు చెందిన విద్యార్థి ఎం.సాత్విక తృతీయ బహుమతులు సాధించారు. విష్ణు సహస్రనామ స్తోత్రం పఠన పోటీల్లో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థిని ఎ.వైష్ణవి ప్రథమ, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి దుహాసన్ ద్వితీయ, పీఆర్ ఆదర్శ్ కుమార్ తృతీయ బహుమతులు సాధించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మైలవరపు లక్ష్మీ నరసింహం, ఎం.లలితా కామేశ్వరి వ్యవహరించారు. విజేతలకు మార్కండేయ వేదపాఠశాల ప్రతినిధి డి.వెంకట రమణ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం బహుమతులు అందజేశారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం


రక్తదాతను అభినందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రక్తదానం ఆవశ్యకతపై ఆర్టీసీ సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన ఉందని ప్రజా రవాణా శాఖ ఏలూరు జిల్లా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ అన్నారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రజా రవాణా అధికారి కార్యాలయం ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ రక్తదానంతో ప్రమాదంలో ఉన్న వ్యక్తులకు పునర్జన్మ అందించవచ్చని, తద్వారా వారి కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చని అన్నారు. ఆర్టీసీ నూజివీడు డిపోకు చెందిన ప్రసాద్ 58వ సారి, శ్రీనివాస్ 20వ సారి, శిబిరంలో సుమారు 70 మంది ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమని ఆయన తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులను బతికించాలనే తపతో రక్తదాతల కోసం నిరంతరం అన్వేషిస్తున్నామన్నారు. ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అంబికా రాజా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చెన్నా నాగభూషణం, కార్యదర్శి వంకదారు శిరీష, ఆర్టీసీ డీపీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ పి.వేణుగోపాల్, పీఆర్ఓ నరసింహం పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో చురుగ్గా పార్కు పనులు


ఆదర్శనగర్‌లో పార్క్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్: స్థానిక ఆదర్శ నగర్‌లో పార్కు అభివృద్ధి చేపట్టారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.40 లక్షలతో చేపట్టిన ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. చుట్టూ కాంపౌండ్ వాల్, లోపల పచ్చని చెట్లు, జాగింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే సీసీరోడ్లు, డ్రైయినేజీతో ఆదర్శ నగన్ అభివృద్ధి బాట పట్టించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు జి.అనిల్‌కుమార్ కొనియాడారు.

ఫిరంగుల దిబ్బ వద్ద చెరువు ప్రక్షాళన


గుర్రపుడెక్క తొలగించిన చెరువు

ఏలూరు రూరల్: ఏలూరు కార్పొరేషన్ సత్రంపాడు పరిసరాల్లో ఫిరంగల దిబ్బ వద్ద చెరువు ప్రక్షాళనయ్యింది. కొంతకాలంగా పిచ్చిమొక్కలు, తూడు, గుర్రపుడెక్కతో నిండిన ఈ చెరువు వల్ల దుర్గంధం వెదజల్లి పరిసర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఫిర్యాదు మేరకు స్పందించిన అధికారులు గుర్రపుడెక్క తొలిగించి, చెరువు ప్రక్షాళన చేశారు. చెరువు మధ్యలో మునీశ్వరుడు తపస్సు చేస్తున్న విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.

తపాలా ఉద్యోగులపై పనిభారం తగదు

ఏలూరు (టూటౌన్): లక్ష్యాల పేరుతో గ్రామీణ తపాలా ఉద్యోగులపై పని భారం మోపటం సరికాదని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పెద్ద పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న ఉద్యోగులతోనే పనిచేయిస్తున్నారని, ఆదివారం కూడా గ్రామీణ ప్రాంతాల్లో తపాలా కార్యాలయాలు తెరిచి పనిచేయాలని అధికారులు పేర్కొనడం తగదని అన్నారు. తపాలా శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగులపై వేధింపులు మానుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియ చేయునది ఏమనగా

[illegible]

ఇట్లు : ఎల్.వి.చైతన్య, అడ్వకేట్, చింతలపూడి

ది. 01.02.2023

అందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియ చేయునది ఏమనగా

[illegible]

ఇట్లు : ఎల్.వి.చైతన్య, అడ్వకేట్, చింతలపూడి

ది. 01.02.2023

అందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియ చేయునది ఏమనగా

[illegible]

ఇట్లు : ఎల్.వి.చైతన్య, అడ్వకేట్, చింతలపూడి

ది. 01.02.2023